ప్రజాసౌకర్యానికి ఏర్పడిన ప్రభుత్వ వ్యవస్థలో ఉద్యోగాలకు చేరేవారు, వ్యాపార సంస్థలలో ఇచ్చేజీతాలను తమకూ ఇమ్మని అడగడానికి వీలులేదు; సబబుకాదు. వ్యాపారసంస్థలలో ఉద్యోగం చేసిన వ్యక్తులు, ఉద్యోగం నుంచి విరమించిన తరువాత వారిగతి యేమైనా ఆసంస్థ పట్టించుకోదు. ప్రభుత్వోద్యోగులకు వచ్చే పింఛను వ్యాపారసంస్థలలో వుద్యోగాలు చేసిన వారికిరాదు. ఉద్యోగంచేసిన ప్రతి ఏడాదికి అరనెల జీతంచొప్పున డబ్బు యిచ్చే పద్ధతి కొన్ని వ్యాపారసంస్థలలో వున్నది; కాని అన్నిటిలోనూ లేదు. ముప్ఫయి సంవత్సరాలు ఉద్యోగం చేసిన వ్యక్తికి పదిహేను నెలల జీతం రొక్కంగా ఇస్తే, ఆవ్యక్తి బహుజాగ్రత్తగా ఖర్చులుచేసుకుంటే, మూడేళ్ళు ఆడబ్బుతో జీవితం గడపలడు. ఆతరువాతమాట! ప్రభుత్వోద్యోగులకు, యీ సమస్యేలేదే. జీవితాంతంవరకూ, ప్రతినెలా అరనెలజీతం, ఎక్కడున్నా వారికి వచ్చిపడుతూ వుంటుందే! ఇలాటి సదుపాయంగల ఉద్యోగంలో, ప్రజా సేవను లక్ష్యంగా పెట్టుకొని చేరినవారు, తమ కోరికలకు ప్రభుత్వం ఒప్పు కొనజాలనంతమాత్రాన సమ్మె చేసి, ప్రజలకు ఎన్నో ఇబ్బందులనూ, నష్టాన్నీ కలిగించడం ఎంతమాత్రమూ హర్షించదగిన విషయంకాదు. అందువల్లనే ప్రభుత్వోద్యోగుల సమ్మెపట్ల ప్రజలు సానుభూతి ప్రకటించలేకపోయారు. ప్రజాసేవ పట్ల ఆసక్తిలేనివారూ, న్యాయంగా తమ విధులను నిర్వర్తించ లేని వారూ, ప్రభుత్వం నిర్ణయించిన జీతాలు తమకు చాలవని నిరంతరమూ సణిగే వారూ ప్రభుత్వోద్యోగాలలో చేరకూడదు. తమసామర్ధ్యానికీ, తమ అర్హతకూ తగిన ప్రతిఫలం ప్రభుత్వోద్యోగాలలో లభించడం లేదని భావించేవారు, ప్రభు త్వోద్యోగాన్ని వెంటనే విడిచిపెట్టి, తమ ప్రతిభకు తగిన ప్రతిఫలంవచ్చే స్థానానికి వెళ్ళడం మంచిది. మర్యాదగా కుటుంబపోషణ చేసుకోడానికి తమ జీతం చాలకపోతే, పరిస్థితులను ప్రభుత్వానికి తెలియపరచడం, పరిస్థితులను చక్కబరచమని ఒత్తిడి తేవడం, తప్పులేదుగాని, ఒక్కుమ్మడిగా సమ్మెజేసి దేశాన్ని ఒక కల్లోలస్థితిలోకి తేవడం మాత్రం తప్పు.

జులై మాసంలో జరిగిన సమ్మె, ప్రభుత్వం ధైర్యంతో చేసిన ఏర్పాట్ల వల్లనూ, ప్రజాబాహుళ్యం ప్రభుత్వానికి ఇచ్చిన సహకారంవల్లనూ నాలుగు రోజులలో తేలిపోయిందిగాని లేకపోతే దేశంలో ఎన్నో ఉపద్రవాలు కలిగేవి. అయిదు రోజుల సమ్మెలోనే, దేశంలో అక్కడక్కడ అల్లరులూ, విధ్వంసక చర్యలూ జరిగాయి. ఎక్కువకాలం సమ్మె సాగినట్లయితే దేశంలో ఎంత అరాచకం ప్రబలేదో! అలాంటి ఆపద సంభవించకుండా బయట పడ్డాం. సంతోషమే. కాని యికముం దెప్పుడూ ఇలాటిపరిస్థితి ఏర్పడకుండాకూడా జాగ్రత్తపడాలి. *

# కర్తవ్యం





కొడుకు వేరే కాపరం పెట్టే ప్రయత్నంలో వున్నాడనీ, అప్పుడే కొంపకూడా ఏర్పాటు చేసుకున్నాడనీ, ఓ బంధువు ద్వారా విన్న ప్రకాశం విస్తుపోయాడు. నటరాజులో ఎందుకీ మార్పు వచ్చిందో, అతని ఊహకి అందలేదు. వాడిపట్ల తను ఏ విషయంలోనైనా కటువుగా ప్రవర్తించాడా? అల్లాంటిదేమీ లేదే! మరెందుకీ అకస్మాత్తు పరిణామం?

ఆలోచనలతో ప్రకాశం తల దిమ్మెత్తిపోయింది. ఈ యాభై అయిదు సంవత్సరాల జీవితంలోనూ అతనెప్పుడూ యిటువంటి సంకట సంఘటనకి గురి కావడం లేదు. మరో నాలుగు

ముద్దంశెట్టి హనుమంతరావు

నెలల్లో రిటైరవుతున్న అతని జీవితంలో, యిప్పుడే యీ సమస్య యెదురవ్వడం నిజంగా శోచనీయమైన విషయమే. హృదయమున్న మానవుడెవ్వడూ సానుభూతి చూపించకుండా వుండలేడు.

ఆలోచించినకొద్దీ ప్రకాశంకి ఒక పక్క బాధ, మరోవేపు కోపం వుద్భవిస్తున్నాయి. కాని, ప్రస్తుతంలో తన అసహాయస్థితి గుర్తుకు తెచ్చుకుని కోపాన్ని దిగమ్రింగుకున్నాడు. లేని సహనాన్ని బలవంతంగా తెచ్చుకున్నాడు. బాధను గుండెల్లో దాచుకున్నాడు.

వాలుకుర్చీలో కూచున్నాడు ప్రకాశం. అతని మెదడు ఆలోచనలతో చిందరవందరయ్యింది. రైళ్లు ఢీకున్నంత సంక్షోభం చెలరేగింది. కొడుకు తనంటే యెంతో గౌరవంతో వుండేవాడు. ఇప్పటికీ వుంటున్నాడు. మరి యిప్పుడిలా వేరేకాపరం పెట్టడం యెందుకొచ్చింది? పెళ్లయ్యాక వచ్చిన మార్పా యిది? వనజ అల్లాంటి విప్లవం తీసుకొచ్చే మనిషిలా అగుపించడం లేదే! ఏమో ...కొందరు మౌనంగా, అమాయకంగా వుండే, తమ మనోరథం నెరవేర్చుకుంటుంటారు. వనజకూడా ఈ కోవకి చెందిన వ్యక్తేమో?

నటరాజు కళ్ళెదుట అగుపించాడు, ప్రకాశంకి. అతడు టిప్ టాప్ గా తయారై, వీధిలోకి బైలుదేరినట్టున్నాడు. తెల్లని పేంటుతో మల్లెపూవులాంటి షర్టు 'టక్' చేశాడు. ఇస్త్రీ మడత ఒక్కటీ నలగలేదు. కాళ్లకి పాతిక రూపాయిలబూటు వుంది. వేరే కాపరం పెడితే, యీ హంగులన్నీ వుంటాయా? అనుకున్నాడు ప్రకాశం. అయినా, యివన్నీ తనకి అప్రస్తుతమని మళ్లీ సర్దుకున్నాడు.

"ఒరేయ్ రాజూ?" గంభీరంగా పిల్చాడు ప్రకాశం.

నటరాజు ఠక్కిన ఆగిపోయి "ఏం నాన్నా!" అంటూ దగ్గరగా వచ్చాడు.

"కూచో అలా...." ముక్తసరిగా ఆజ్ఞ యిచ్చాడు.

బట్టలు నలిగిపోతాయన్న బాధ పట్టుకుంది నటరాజుకి.

"చెప్పండి నాన్నా! నిల్చుంటాను" అన్నాడు.

"నువ్వు వేరే కాపరం పెడుతున్నావటగా?" సూటిగా కొడుకు మొహంలోకి చూస్తూ అన్నాడు. ఆ మాటల్లో కాస్తంత సౌమ్యత వున్నా, చూపుల్లో కరకుదనం కొట్టొచ్చినట్టు కన్పించింది నటరాజుకి.

నటరాజు నిర్విణ్ణుడైపోయాడు. ఏం చెప్పాలో క్షణం వరకూ తట్టింది కాదు. ఆ మౌనం ప్రకాశంని మరింత రెచ్చగొట్టింది.

"శిలాప్రతిమలా మౌనం వహించా



వేమిటి? చెప్పు. నిజమేనా? వున్న విషయం చెప్పడానికి భయమెందుకు?"

"ఔన్నాన్నా! వనజకి ఇక్కడుండటం యిష్టంలేదట." తడబడుతూ అన్నాడు.

తను అనుకున్నంతా జరిగినందుకు ప్రకాశం మరింతగా రెచ్చిపోయాడు.

"ఆ మాట చెప్పడానికి నీకు సిగ్గు పుట్టలేదురా? పెళ్ళాం యెలా చెబితే అలా చేస్తావన్న మాట? మరి నీవ్యక్తిత్వం యేమయ్యింది? భర్తగా నీ ఆధిక్యత యెక్కడికి పోయింది? భార్యచేతిలో కీలుబొమ్మగా బ్రతకడంకంటె హీనం మరోటి వుందా? ఈ వేళ వేరే కాపరం పెట్టమంది. ముందూ, వెనుకా యోచించకుండా అందుకు సిద్ధమౌతున్నావు. రేపు నన్ను నడిరోడ్డుమీద తన్నమంటుంది. అప్పుడూ అలానే చేస్తావు." వుద్రేకంతో చెప్పుకుపోతున్నాడు ప్రకాశం.

"నాన్నా" అన్నాడు చప్పున వణికే కంఠంతో.

"ఏవిట్రా? నేనేం తప్పు మాటన్నానా? భార్యమాటలే వేదవాక్యాలుగా పట్టించుకునే పరిస్థితి, యేనాడైతే యేర్పడిందో మరిక విచక్షణ జ్ఞానం యెక్కడుంటుంది? సరే... నిన్ను బలవంతపర్చి ఆపడం నాకిష్టం లేదు. నీ ప్రయత్నమే సాగనీయ్. మీ ఆవిడ మనోరథమే తీర్చు.... వెళ్ళిక...."

"అదికాదు నాన్నా!" ఏమీ తోచని అయోమయస్థితిలో, తండ్రికి నచ్చజెప్పాలని ప్రయత్నించాడు నటరాజు.

"నాకు యింకే మీ సంజాయిషీ చెప్పనవసరంలేదు. నువ్వింక వెళ్లు...." అన్నాడు విసుగూ, కోపంతో.

ఆ ఉద్రిక్త వాతావరణంలో తండ్రికి నచ్చజెప్పడం, ఓ మార్గానికి తీసుకు రావడం, అసాధ్యమనుకుని, మెల్లగా అడుగులు వేసుకుని బైటికి నడిచాడు నటరాజు.

ప్రకాశం గుండెల్లో రేగిన మంటలు ప్రజ్వలించాయి. ఇప్పుడేం చెయ్యడమా అని ఆలోచించాడు. వనజను నిలదీసి అడిగితే! వెళ్లబోతున్నవాళ్లు ఎలాగా వెళ్లిపోతారు. తన అక్కసు తీరినట్టు గుణపాఠం చెబితే? ఔను. చెప్పాలి అనుకున్నాడు.

"ఏవమ్మా వనజా!" యింట్లోపలికి కేక వేశాడు. మెల్లిగానే కేక వేశానని అతననుకున్నాడుగాని, కర్కశంగానే వుందా గొంతు.

వనజ ఆతృతగా వచ్చింది. "ఏం మావగారూ?" అంది సవినయంగా.

"ఇలా కూర్చో!" అన్నాడు గంభీరంగా.

వనజ మొహం వివర్ణమయ్యింది. తననెప్పుడూ పిల్చి మాట్లాడని మావగారు, యేవిటి ప్రస్తావించదల్చుకున్నారో, ఆమెకి అర్థంకాలేదు.

ప్రక్కనే వున్న స్టూలుమీద కూచుంది.

ప్రకాశం లేనిశాంతినీ, సహనాన్నీ పుంజుకున్నాడు.

"ఈ ఇంట్లో నీకు జరుగుతున్న అన్యాయం యేవిఁటమ్మా?" అదీ అతని మొదటి ప్రశ్న. చాలా సౌమ్యంగానే అడిగాడు.

"అన్యాయమా?" విస్తుపోయింది వనజ. కాదూ మరి — తలాతోకా లేకండా ఆవిధంగా ప్రశ్నిస్తే. యెవరికైనా ఆశ్చర్యమే కలుగుతుంది.

"ఔనమ్మా! ఈ యింట్లో, నిన్నెవరైనా రాచిరంపాన పెడుతున్నారా! కొడుతున్నారా! అనరాని మాటలంటున్నారా?"

"మీరు యేవిఁటంటున్నారో, నాకు అర్థంకాలేదు." బిత్తరిబోయింది వనజ.

"అర్థంకాలేదూ! అర్థంకాకుండా వేరేకాపరం పెట్టమని పురమాయించావెలా?" కాస్త కటువుగానే అన్నాడు ప్రకాశం.

ఇంటి పైకప్పు దభీమని తలమీద పడినట్టయ్యింది వనజకి. కళ్లు బైర్లు కమ్మాయి. కాళ్లు కాస్తంత వణికాయి. కొడుకూ, తండ్రీ యేం ఘర్షణపడినా పడతారనుకుందిగాని, తననే యిలా నిలదీసి అడుగుతారని యెప్పుడూ ఆమె వూహించలేదు.

"నేను వేరే కాపరం పెట్టమన్నానా?" అంది తనకేమీ తెలీదన్నట్టు.

"ఎందుకమ్మా అలా తప్పించుకుందుకు ప్రయత్నిస్తావు? ఆడవాళ్ళ మనస్తత్వం నాకు తెలీందేమీకాదు. భర్తల్ని పురమాయిస్తారు, తీరా పరిస్థితులు యెదురు తిరిగితే ఆ అభాండాన్ని భర్తలమీదే రుద్దేస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమేగా! యిప్పుడే క్షణంక్రితం వాణ్ణి అడిగాను. ఇక్కడ వుండటం యిష్టంలేదని నువ్వే అన్నావుటగా?"

"నేనన్నానా?" తప్పుకునే ప్రయత్నం యింకా మానలేదామె.

"అయ్యుండాలి. పెళ్లికానంతవరకూ అననివాడు, యీ రోజు ఆ తలంపుతో వున్నాడంటే, వాడంతట వాడికే, యీ బుద్ధి పుట్టిందని, యెంతటి తెలివిహీనుడైనా నమ్ముతాండా?"

"అయితే, నేనే పురమాయించానంటారు మీరు?" కోపంగా అంది.

"కోపం వద్దమ్మా! మీ మార్గానికి యెవరూ అడ్డురారు. కాని, మాబాధ మీకు తెలీదు. కని, పెంచి, పెద్దవాణ్ణి చేసి, ఉద్యోగం చేయించి, ఒక యింటివాణ్ణి చేశాం. వాణ్ణింత అభివృద్ధిలోకి తీసుకురావడానికి మేమెన్ని అవస్థలు పడ్డామో లోకానికి తెలుసు. ఎందుకు అవస్థలు పడ్డాం? కొడుకులు ప్రయోజకులైతే తలిదండ్రులకు ఆనందం యెందుకుంటుంది? వార్థక్యంలో



తమని ఆదుకుంటాడని.... అంతేకదా! పుత్రసంతానం కావాలని ప్రతివాళ్లూ యెందుకు వువ్విళ్లూరుతూ, ఆరాటపడుతూ, వేయి దేవుళ్లకు మొక్కుతారు? పున్నామ నరకంనుండి తప్పిస్తాడనా? వంశాన్ని వుద్ధరిస్తాడనా? నిజానికి యివేమీ కారణాలు కావని నా వుద్దేశం. కేవలం తమని వృద్ధాప్యంలో ఆదుకుంటాడని. ఆ ఆశలే మాకూ వున్నాయమ్మా! మీ రిప్పుడు వేరే కాపరం పెడితే, యింక మాగతి యేంకావాలి? మేం యెవరి నీడను బ్రతుకుతాం? అంటే నా వుద్దేశం బ్రతకలేమని కాదు. ఆనందంగా బ్రతకలేం. గంపెడు దుఃఖాన్ని గుండెల్లో యిముడ్చుకుని బ్రతుకుతాం. మాకు యే కష్టమొచ్చినా ఆదుకునేవాళ్లు ఎవరు? అదీ ఒక బ్రతుకేనా? ఈ నాడు నువ్వు యీ యింట్లో అడుగుపెట్టి, మా అనుబంధాన్ని త్రెంచి, మా ఆశలన్నీ ఆకాశహర్మ్యాలు చేయడం బావుండదేమో, ఒక్కసారి ఆలోచించు?" వుపన్యాసమిచ్చే ధోరణిలో అన్నాడు ప్రకాశం.

అంతవరకూ సహనంతో వుండి, తనపై వాదు రాకండా తప్పించుకోవాలని ప్రయత్నించిన వనజకి కాస్తంత కోపం, పౌరుషం వచ్చాయి.



"చూడు, ఆ అమ్మాయిని! ఇంతసేపూ నావైపు చూసి ఇప్పుడే ఇట్టే మొగం తిప్పేసుకుంది."
"అలాగా, పాపం? నే కనుక్కుంటానులే. ఆవిడ నా భార్య."

"మీ స్వార్థంకోసం ఆయన్ని వృద్ధిలోకి తెచ్చాననడం యేమీ భావ్యంగా లేదు. పిల్లల్ని పోషించడం, అభివృద్ధిలోకి తీసుకురావడం మీ విధి. మీరా కర్తవ్యాన్ని నిర్వర్తించారు." అంది.

"నీమనస్థత్వం యిప్పుడర్థమయ్యింది. నువ్వన్నట్టు అది నా కర్తవ్యమే! మన పూర్వులు కొన్ని నియమాలు పాటించారు. అవే మనమూ పాటించుతున్నాం. తలిదండ్రుల్ని ఆదుకోవల్సిన బాధ్యత కొడుకులపై వుందన్న విషయంకూడా అందులో ఒకటి."

"అది స్వకల్పితం. అల్లాంటిదెక్కడా లేదు."

ప్రకాశంకి వళ్లు మండిపోయింది. కోడలిపై కోపం కట్టతెగి ప్రవహించింది

"తెలివిగా మాట్లాడుతున్నా వని అనుకోకు. ఆమాటకొస్తే అన్నీ స్వకల్పితాలే! ఎవరి వరకూ వస్తే, వారి కా బాధ తెలుస్తుంది. కాలక్రమాన మరో వనిత వలలో పడి, నీకు వాడు దూరంగా పోతే, అప్పుడు నువ్వేమంటావు? ఎంతగా బాధ పడతావు? నీ హక్కులకోసం, యెంతగా వెనుగులాడతావు? వాణ్ణి నీ దరికి రప్పించుకుందుకు యెన్ని ప్రయత్నాలు చేస్తావు? ఎంతమంది పెద్దల్ని ఆశ్రయిస్తావు? నీ అవస్థ చూసి మేం సంతోషిస్తామా? లేదు. మా విధిని మేం నిర్వర్తిస్తాం. వాడినే నాలుగు చీవాట్లు పెట్టి, ఓ మార్గానికి తెస్తాం. అంతేగాని, మాకెందుకని మౌనంగా వూరుకోం. ఇల్లాంటివన్నీ కొన్ని నియమాలు మన పూర్వులు నిర్ణయించారమ్మా. అవి మనం పాటించాల్సిందే!" అన్నాడు మళ్లీ ప్రకాశం.

వనజ మాట్లాడలేక పోయింది. తను వేరే కాపరం పెడితే, మావఁగారు చెప్పినట్టే ఆయన మరో వనిత వలలో పడి తనని దూరం చేస్తే, తన గతేమౌతుంది? అప్పుడు తనని ఆదుకునే వాళ్లెవరు? ఈ అత్తా, మావఁగారూ ఆదుకుంటారా? లేక ప్రతీకార వాంఛతో కొడుకునే పరోక్షంగా ప్రోత్సహిస్తారా? ఏమో, అప్పటికి యెవరి మనసులు ఎలా వుంటాయో? అంతా జరుగుతున్నట్టే ఆలోచించింది వనజ. ఆమె వొళ్లంతా స్వేదంతో నిండిపోయింది. అశాశ్వితములైన స్వేచ్ఛ, సరదాల నాశించి వేరే కాపరంకోసం ప్రోత్సహించడం, తన తెలివితక్కువతనమే ననుకుంది.

"వెళ్లమ్మా యిక. నీ మనస్తత్వం తెలుసుకుందుకే యిలా అడిగాను. మరి నువ్వేమీ అనుకోకు. మీరు యథేచ్ఛగా వేరే కాపరం పెట్టొచ్చు. నాకేం అభ్యంతరం లేదు. మా ఆశీస్సులు మీకెప్పుడూ వుంటాయి." అన్నాడు బొంగురు గొంతుతో.

వనజకి నోట మాటరాలేదు. ఆమె కళ్ల నీళ్లపర్యంత మయింది. చరచరా లోపలికి పోయింది.

* * *

రెండు రోజులు గడిచాయి. ప్రకాశంకి తెలిసింది కొడుకు పర్పాటు చేసుకున్న యింట్లో యెవరో అద్దెకు దిగినట్టు.

వనజలో మార్పు వచ్చినందుకు లోలోన సంతోషంతో నవ్వుకున్నాడు ప్రకాశం.



# పనిలేని మంగలి

"మన్మనాభవ, మద్భక్తో, మద్యాజీ, మాం నమస్కురు," అన్నాడు అర్జునుడితో భగవానుడు. ఇది భక్తిమార్గం.

భక్తి అనగానే మనకు చేతులు జోడించిన వాళ్లూ, కళ్లు మూసుకున్న వాళ్లూ, మోకరించిన వాళ్లూ, తలలువంచి నిలబడిన వాళ్లూ సాష్టాంగ పడినవాళ్లూ జ్ఞాపకం వస్తారు. ఇది మౌనభక్తి. మ్యూజికల్ భక్తి ఒకటి ఉంది. దాన్ని తలుచుకుంటే ఒకచేత తంబురా, ఇంకోచేత్తో చిరతలూ ధరించి, ఒంటి మీది బట్టలు జారిపోతూ, పారవశ్యంలో నృత్యాలు చేసేవాళ్లు జ్ఞాపకం వస్తారు.

మనం మహాభక్తుల చరిత్రలు తిరగవేసినట్టయితే భక్తిలో నవరసాలూ ఒప్పించవచ్చు నని స్పష్ట మవుతుంది. కొందరు భక్తులు తాము రాధల మనుకుని మాధవుడికోసం వెతుకుతూ, విరహమూ, తదనంతరం ఆలింగనాది సుఖాలూ అనుభవించినవాళ్లు; అద్భుతమైన కవితాశక్తికి హిస్టీరియా జతచేసినట్టు ఊహించబడే మీరాబాయి, కృష్ణుడు తన కొంగుపట్టి లాగినట్టు భావన చేసిందిట! తన కుర్రవాణ్ణి అడుసులో వేసి తొక్కేసి భీభత్సరసం సృష్టించిన భక్తుడున్నాడు. అనేకమంది భక్తులు భగవంతుణ్ణి పడదిట్టారుకూడా! కొందరి విషయంలో భక్తి ఏ దశను అందుకున్నదంటే భగవంతుడికి వాళ్లు గర్భశత్రువులుగా జీవించి, భగవంతుడి చేతిలో చచ్చి సాయుజ్యం పొందారు.

భక్తి తత్వంలో చాలా తిరుగుళ్లున్నాయి.

కాని చాలామంది గమనించని తిరుగుదేమిటంటే, భక్తి భగవంతుడి పైనే కాదు, దాదాపు దేనిపైన అయినా తెచ్చుకోవచ్చు. కళలలో, రాజకీయాలలో, సాంఘిక కార్యకలాపాలలో — అన్నింటా భక్తి మార్గం ఉన్నది. అది అమలు జరుగుతున్నది కూడానూ.

మన ప్రభుత్వం మతవిరహితమైన సాంఘిక వ్యవస్థకోసం కృషి చేస్తున్నప్పటికీ భక్తికి తగినంత ప్రాముఖ్యం ఇస్తూ ఉండటం గమనించదగిన విషయం, హర్షించదగిన విషయం కూడానూ.

మన రేడియో స్టేషన్లు తమ దిన చర్యను మంగళ గీతాలతోనూ, భక్తి